క్లుప్తంగా

అభయాంజనేయుడికి తమలపాకుల అర్చన



తమలపాకుల అర్చన నిర్వహిస్తున్న అర్చకుడు

ఆళ్లగడ్డ: పట్టణంలోని శ్రీఅభయాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం లక్ష తమలపాకులతో అర్చన నిర్వహించారు. వేకువజామునే అర్చకులు మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, హోమ పూజలు చేశారు. అనంతరం లక్ష తమలపాకులతో శాస్త్రోక్తంగా అర్చన చేసి సామూహిక అన్నప్రసాద కార్యక్రమం చేపట్టారు.

1 నుంచి సదరం స్లాట్ ప్రారంభం

గోస్పాడు: సదరం స్లాట్ ఏప్రిల్ 1 నుంచి తిరిగి ప్రారంభం కానుందని ఎంపీడీఓ అమానుల్లా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో దివ్యాంగుల వెరిఫికేషన్ కారణంగా జనవరిలో విడుదల కావలసిన సదరం స్లాట్‌లు ఇప్పటివరకు నిలిపివేసినట్లు వెల్లడించారు. దివ్యాంగుల విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం వెరిఫికేషన్‌తో పాటు స్లాట్లను తిరిగి ప్రారంభించిందన్నారు. ఈ స్లాట్లు ఎంపిక చేసిన ఏరియా, జిల్లా, టీచింగ్ ఆసుపత్రులు/జీజీహెచ్‌లలో ప్రతి మంగళవారం అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఏప్రిల్ 1, 2025 నుంచిఈ సేవలు అమలులోకి వస్తాయని, అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పన్నులు చెల్లించాలి

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని భవన యజమానులు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 2024–25 ఏడాదికి ఇంటిపన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలు ఈనెల 31వ తేదీ లోగా చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి చెప్పారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెలాఖరులోపు చెల్లించే వారికి 50 శాతం వడ్డీ మాఫీ ఉంటుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సచివాలయాలు, మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సెలవుల్లో కూడా కౌంటర్లు పని చేస్తాయని ఆయన తెలిపారు.

రేపు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 27వ తేదీన జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ, వైస్ ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఇంటర్, ఐటీఐ, డిగ్రీ అర్హత కలిగిన విద్యార్థులు ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలన్నారు. మరింత సమాచారం కోసం సెల్ : 9703377803, 7799337695 నంబర్లను సంప్రదించాలన్నారు.

'రైతులకు నీళ్లు ఇవ్వలేని అధికారులు వెళ్లిపోవాలి'

నంద్యాల(అర్బన్): కేసీ కాల్వ ద్వారా చివరి ఆయకట్టు రైతులకు నీరు ఇవ్వలేని అధికారులు వేరే డిపార్టుమెంట్‌కు బదిలీ చేయించుకొని వెళ్లిపోవాలని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ హెచ్చరించారు. సాగునీరు అందించే విషయంలో కొంత మంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. కేసీకి వస్తున్న నీటిని సర్దుబాటు చేయలేకపోతున్నారన్నారు. కేసీ కెనాల్‌లో తగ్గిన నీటిని పరిశీలించేందుకు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ పాన్నాపురం స్లూయిస్ గేట్ల వద్ద సాగునీటి సరఫరా విషయంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీ కాల్వ చివరి ఆయకట్టుకు నీరు అందించేందుకు తాము కృషి చేస్తుంటే అధికారులు అడ్డుపడుతున్నారన్నారు. కేసీలో ఐదున్నర అడుగుల నీరు ఉంటేనే చివరి ఆయకట్టుకు నీరు అందుతుందని, ప్రస్తుతం మూడు అడుగుల నీరు కూడా లేకపోవడంతో ఆళ్లగడ్డ ప్రాంతంలో సాగు చేసిన లక్ష ఎకరాల పంటలు ప్రశ్నార్థకంగా మారాయన్నారు. గేజ్ మెయింటెన్ చేస్తూ చివరి ఆయకట్టు రైతులకు నీరు అందేలా చూడకపోతే అధికారులే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

పీ 4 సర్వే వంద శాతం పూర్తి

ఉయ్యాలవాడ : మండల పరిధిలోని 11 గ్రామ సచివాలయాల్లో పీ 4 సర్వే వంద శాతం పూర్తయిందని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలో 7,425 కుటుంబాలను సర్వే చేశామన్నారు. పేద, మధ్య తరగతి, అత్యధిక ఆదాయం కలిగిన కుటుంబాలను గుర్తించడం జరిగిందన్నారు. సర్వేలో తేలిన పేద కుటుంబాలకు అత్యధిక ఆదాయం కలిగిన వారితో సమన్వయ పరచి వారి నుంచి ఆర్థిక సహాయం అందేలా చూడటమే ఈ సర్వే ముఖ్య ఉద్దేశమన్నారు. వర్క్ ఫ్రం హోంలో భాగంగా 13,956 మంది నిరుద్యోగులను సర్వే చేయవలసి ఉండగా 11,000 మందిని సర్వే చేశామన్నారు. ఈ నెలాఖరులోగా వంద శాతం పూర్తి చేస్తామన్నారు. నిరుద్యోగులకు ప్రభుత్వం తరుఫున వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తామన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి బాసట



మహిళలకు చెక్కులు అందజేస్తున్న శిల్పారవి

నంద్యాల(వ్యవసాయం): శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ ద్వారా రుణాలు పొందిన మహిళలు ఆర్థికాభివృద్ధి చెంది ఇతరులకు ఆదర్శంగా నిలవాలని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక శిల్పా సేవా సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై 145 మంది మహిళలకు రూ. 22.65 లక్షలకు సంబంధించిన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శిల్పారవి మాట్లాడుతూ శిల్పా సేవా సమితి ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మహిళల జీవనోపాధికి దోహదం చేసే టైలరింగ్, మెహిందీ డిజైనింగ్‌లో శిక్షణ ఇస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేస్తామన్నారు. కార్యక్రమంలో శిల్పా సేవాసమితి మేనేజర్ లక్ష్మీనారాయణ, కృష్ణాపురం సర్పంచ్ కోటిరెడ్డి, బ్యాంక్ డైరెక్టర్ పూర్ణిమ, మేనేజర్ హరిలీలా తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు టిడ్కో గృహాలివ్వాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): తమకు టిడ్కో గృహాలు కేటాయించాలని పేదలు రోడ్డెక్కారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఆందోళన కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏసురత్నం మాట్లాడుతూ పట్టణంలో ఈనెల 13 నుంచి 18వ తేదీ వరకు ప్రజా చైతన్య యాత్ర సభలు నిర్వహించి కాలనీల్లో సమస్యలు తెలుసుకున్నామన్నారు. చాలా మంది పేదలకు పక్కా గృహాలు లేవన్నారు. టిడ్కో గృహాలను వారికి కేటాయించాలన్నారు. అనంతరం చైర్‌పర్సన్ మాబున్నిసాకు, కమిషనర్ నిరంజన్‌రెడ్డికి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పుల్లా నరసింహులు, పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, గౌస్, సీనియర్ నాయకులు తోటమద్దులు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలమివ్వాలి



బైఠాయించిన దళిత సంఘాల నాయకులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని దళిత బహుజన సంఘాల నాయకులు కొమ్ముపాలెం శ్రీనివాస్, ఏసీ వెంకటసుబ్బయ్య, బాయికాటి బెనర్జీ, లక్ష్మణ్, అనిల్ అమృతరాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ భవనం ఎదుట దళిత ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ విగ్రహ ఏర్పాటుకు స్థలం ఇవ్వాలని తాము పలుమార్లు విన్నవించినా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. కేవలం అంబేడ్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించడం కాదని, ఆయన విగ్రహం ఏర్పాటుకు కూడా చొరవ తీసుకోవాలన్నారు. ఏప్రిల్ 14వ తేదీలోపు స్థలం చూపించకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్టిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ప్రేమ్‌కుమార్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతో భేటీ



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆళ్లగడ్డ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి మంగళవారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

– ఆళ్లగడ్డ

వైభవంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం





శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు పూజలు చేస్తున్న వేదపండితులు, పల్లకీలో స్వామి, అమ్మవార్ల ఊరేగింపు దృశ్యం

చాగలమర్రి: మండలంలోని మూదురాళ్లపల్లె గ్రామంలో శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. మంగళవారం శ్రావణ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఉభయదారులు మైలారు శ్రీనివాసులు, మైలారు మురళీ దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ప్రముఖ అర్చకులు కైప వెంకటేశ్వర శాస్త్రి శాస్త్రోక్తంగా జరిపారు. ముందుగా గణపతి పూజ, పుణ్యహవాచనం, కంకణ ధారణ, పట్టు వస్త్రాల సమర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు కల్యాణం జరిపించి పల్లకీలో ఊరేగించారు. భక్తుల సౌకర్యార్థం ఉభయదారుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ, పులి చిన్న ఓబుల్‌రెడ్డి, పులిఓబుల్ రెడ్డి, మహేశ్వరరెడ్డి, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి పని చేసుకోవాలి



డీఎంఅండ్‌హెచ్‌ఓను సన్మానిస్తున్న గ్రామీణ వైద్యులు

గోస్పాడు: గ్రామీణ వైద్యులు నిబంధనలకు లోబడి పని చేసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. మంగళవారం పట్టణంలోని వివేకానంద ఆడిటోరియంలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్ రెడ్డి అధ్యక్షతన జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ నమ్మి వచ్చిన ప్రజలకు ప్రాథమిక వైద్యాన్ని సక్రమంగా అందించాలన్నారు. ఈ విషయంలో నిబంధనలను ఏమాత్రం అతిక్రమించినా చర్యలు తప్పవన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు రాధాకృష్ణయ్య మాట్లాడుతూ జిల్లాలో సంఘ నియమ నిబంధనలకు లోబడి ప్రాథమిక వైద్యం అందజేస్తూ సంఘ సభ్యత్వం తీసుకున్న వారికి మాత్రమే సంఘం నుంచి సహకారం అందిస్తామని తెలిపారు. అలాగే ప్రతి సభ్యుడు ప్రతినెల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే విజ్ఞాన తరగతులకు హాజరై గ్రామీణ ప్రజలకు చేయదగిన, చేయకూడని వైద్య విజ్ఞానంపై శిక్షణ పొందాలని తెలిపారు. గ్రామీణ వైద్యులు పాటించవలసిన నియమ నిబంధనలకు సంబంధించిన కరపత్రాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి దస్తగిరి, గ్రామీణ వైద్యులు సురేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు నైతిక విలువలు నేర్చుకోవాలి



క్రీడా జ్యోతి వెలిగిస్తున్న ఏఎస్పీ యుగంధర్‌బాబు

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థినీ విద్యార్థులు చదువుతో పాటు నైతిక విలువలు నేర్చుకోవాలని నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు సూచించారు. మంగళవారం నంద్యాల పట్టణ సమీపంలోని క్రాంతి నగర్‌లో ఉన్న శ్రీశాంతినికేతన్ సీబీఎస్‌ఈ విద్యాసంస్థల్లో స్పోర్ట్స్ మానియా– 2025 కార్యక్రమం జరిగింది. ఆ విద్యాసంస్థల చైర్మన్ సూర్యదేవర సుధాకర్, ప్రిన్సిపాల్ రమ్యారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అడిషనల్ ఎస్పీ హాజరై మాట్లాడారు. క్రీడలు విద్యార్థుల్లో మానసిక వికాసాన్ని పెంపొందిస్తాయన్నారు. ప్రతి ఒక్కరు ఏదో ఓ క్రీడలో సాధన చేసి రాణించాలన్నారు. క్రీడాపోటీలు నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న శాంతినికేతన్ విద్యాసంస్థల యాజమాన్యాన్ని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

భూ రీసర్వే పనులకు రైతులు సహకరించాలి



దొర్నిపాడులో మాట్లాడుతున్న తహసీల్దార్ సుభద్ర

దొర్నిపాడు: మండల కేంద్రం దొర్నిపాడులో త్వరలో ప్రారంభమయ్యే భూ రీసర్వే పనులకు రైతులు సహకరించాలని తహసీల్దార్ సుభద్ర సూచించారు. మంగళవారం స్థానిక ఎరుకలిస్వామి ఆలయ ఆవరణలో భూ రీసర్వేపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీసర్వేను రైతుల సమక్షంలోనే జరుపుతామన్నారు. సర్వేనంబర్లు, విస్తీర్ణంలో వ్యత్యాసం ఉంటే తగిన ధ్రువపత్రాలు సమర్పించి సరిచేసుకోవాలని సూచించారు. 5,150 ఎకరాలు ఉందని ఎలాంటి తొందపాటు లేకుండా నిర్ణయించిన సమయంలో సర్వేను పూర్తి చేయాలని గ్రామ సర్వేయర్లకు సూచించారు. దీర్ఘకాలిక భూ సమస్యలకు రీసర్వే ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శకుంతల, డిప్యూటీ తహసీల్దార్ మాధవ, వీఆర్‌ఓలు నాగేష్, సావిత్రి, గ్రామ సర్వేయర్ నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే

ఉయ్యాలవాడ: గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వే నిర్వహిస్తోందని డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామంలో రీ సర్వేపై రైతులతో సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో రీ సర్వేపై అనుమానాలు నివృత్తి చేసేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ గ్రామంలో 584 మంది రైతులకు చెందిన 1600.11 ఎకరాలు రీ సర్వే చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ విజయలక్ష్మి, వీఆర్‌ఓ లక్ష్మీనారాయణరెడ్డి, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

వేలంలో తగ్గిన ఆదాయం

శిరివెళ్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ మార్కెట్ల బహిరంగ వేలం పాటలు మంగళవారం జరిగాయి. సర్పంచు సాలమ్మ అధ్యక్షతన, డీఎల్‌పీఓ రాంబాబు పర్యవేక్షణలో దిన, కబేళా మార్కెట్లకు వేలం పాటలు నిర్వహించగా ఆదాయం తగ్గింది. రెండు మార్కెట్లకు గత ఏడాది రూ. 7.71 లక్షలు రాగా ఈసారి రూ. 7.53 లక్షలు వచ్చింది. దిన మార్కెట్‌ను గౌస్ యూనిష్, కబేళాను సిద్దీక్‌లు అత్యధిక పాట పాడి కాంట్రాక్ట్ దక్కించుకున్నారు. కాగా వార సంతకు వేలంపాట నిర్వహించగా పంచాయతీ నిర్ణయించిన ధర రాక పోవడంతో అధికారులు పాటను వాయిదా వేశారు. ఈ నెల 28వ తేదీన తిరిగి వేలం పాట నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. కార్యక్రమంలో ఉప సర్పంచు ఇంతియాజ్, ఈఓ అశ్వినికుమార్, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి అడ్డుగా మారితే ఎలా?

- మున్సిపల్ ఇంజినీర్ గుర్రప్ప తీరుపై చైర్‌పర్సన్ ఆగ్రహం
- అధికారులు పార్టీలకు అతీతంగా పనిచేయాలని సూచన





మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, ఇంజినీర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్న కౌన్సిల్ సభ్యులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణాభివృద్ధికి సహకరించాల్సిన అధికారులే అడ్డుగా మారితే ఎలా అని మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా ఆగ్రహం వ్యక్తం చేశారు. నంద్యాల మున్సిపల్ ఇంజినీర్ గుర్రప్ప తీరు సరిగా లేదని, బాధ్యత రహితంగా మాట్లాడుతున్నారని ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అభివృద్ధిపనులు అడ్డుకుంటున్న టీడీపీ నాయకులకు మునిసిపల్ ఇంజినీర్ వత్తాసుపలుకుతున్నారని కౌన్సిల్ సభ్యులు సైతం మండిపడ్డారు. మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ హాల్‌లో సాధారణ సమావేశం జరిగింది. 33 అంశాలు కౌన్సిల్‌లో ఆమోదం తెలిపారు. 31వ వార్డులో సచివాలయ నిర్మాణాన్ని పూర్తి చేయాలని కౌన్సిలర్ అనురాధ కోరారు. పనులు జరగకుండా కాంట్రాక్టర్‌ను స్థానిక టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారని, వారికి మున్సిపల్ ఇంజినీర్ గుర్రప్ప వత్తాసు పలికి పనులను నిలిపి వేశారన్నారు. ఇలా చేస్తే పార్టీలకు అతీతంగా పనిచేసే అధికారులను తెచ్చుకుంటామని చైర్‌పర్సన్ ప్రకటించగా..అలాగే తెచ్చుకోండంటూ మునిసిపల్ ఇంజినీరు నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీనిని కౌన్సిలర్లు తీవ్రంగా తప్పు పట్టారు. చైర్‌పర్సన్ పట్ల ఇంజినీర్ వ్యవహరించిన తీరు సరిగా లేదని చెప్పారు. ఇదిలా ఉంటే తర్వాత చైర్‌పర్సన్ మాట్లాడుతూ మునిసిపాలిటీకి చెందిన స్థలాలను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అన్ని ప్రభుత్వ ఖాళీ స్థలాలను సర్వే చేయించి ఫెన్సింగ్ వేయించాలని ఆదేశించారు. కంపోస్టు యార్డుల్లో స్వచ్ఛంద కార్పొరేషన్ ద్వారా చెత్తను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టామని, వచ్చే నెల 19వ తేదీన నంద్యాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రానున్నారని కమిషనర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో చేసిన అభివృద్ధి పనులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారా.. అయితే వాటి వివరాలను తెలియజేయాలని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దేశం సులోచన కమిషనర్‌ను కోరారు. సమావేశంలో వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పడకండ్ల సుబ్రమణ్యం, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశం జరుగుతుండగానే చెప్పకుండా బయటకు వెళ్తున్న మున్సిపల్ ఇంజనీర్ గుర్రప్ప

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ

నంద్యాల(వ్యవసాయం): శ్రీకాళికాంబ చంద్రోశేఖరస్వామి దేవస్థానంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం 108 వెండి పుష్పాలతో అమ్మవారికి అష్టాదళ పాదపద్మారాధన సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహామంగళ హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, వేదపండితులు రాఘవేంద్ర, మరణాచారి, ఆరవేటి వాసు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీలో బదిలీలు

దొర్నిపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబధించి ఏపీఓగా పనిచేస్తున్న గంగన్న గోస్పాడుకు, ఈసీ సోమశేఖర్ మహానంది, టెక్నికల్ అసిస్టెంట్ రాజు ఉయ్యాలవాడ, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీలక్ష్మి ఆళ్లగడ్డకు బదిలీ అయ్యారు. అలాగే దొర్నిపాడుకు ఏపీఓగా హనీఫా బేతంచర్ల వస్తుండగా సంజామల నుంచి కంప్యూటర్ ఆపరేటర్ గోపాల్, టెన్నికల్ అసిస్టెంట్‌గా జయభరత్‌రెడ్డి కోవెలకుంట్ల నుంచి రానున్నారు. వీరంతా త్వరలో బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు చెప్పారు.

దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ



ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రంలో మంగళవారం మేనేజింగ్ డైరెక్టర్ ఇస్మాయిల్ దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహాయ పరికరాలు కావాల్సిన జిల్లాలోని దివ్యాంగులు పునరావాస కేంద్రంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ నాగరాజు, శ్రావణి, వెంకటేశ్వర్లు, మోహన్‌రెడ్డి, దానంబాబు పాల్గొన్నారు.

దంత వైద్య పరీక్షలు



విద్యార్థులను పరీక్షిస్తున్న దంత వైద్యుడు

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని దేవరాయపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఇన్నర్‌విల్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మంజునాథ్ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి దంతాల పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అవసరమైన వారికి మందులు, పేస్ట్‌లు, బ్రష్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఇన్నర్‌విల్ క్లబ్ అధ్యక్షురాలు ఉషారాణి, ఎంఈఓ శోభావివేకవతి ఉన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్





ప్రార్థనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శిల్పారవి, ఉపవాసదీక్షపరులకు ఇఫ్తార్‌లో ఫలహారం తినిపిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలకు ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక అని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని గాంధీచౌక్‌లో ఉన్న జుమ్మా మసీదులో ముస్లిం సోదరులతో కలిసి మాజీ ఎమ్మెల్యే ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ముందుగా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉపవాసదీక్షపరులకు ఆహార పదార్థాలు వడ్డించారు.అనంతరం మాజీ ఎమ్మెల్యే శిల్పారవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని అల్లాకు దువా చేయాలని ముస్లింలను కోరారు. ఎన్నో సంవత్సరాలుగా నంద్యాల పట్టణంలో హిందూ, ముస్లింలు ఐకమత్యంగా ఉన్నారన్నారు. ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో చేస్తున్న ఉపవాస దీక్షలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సమ్మద్, ఆరీఫ్ నాయక్, కలాం, వైఎస్సార్‌సీపీ నాయకులు రసూల్ ఆజాద్, దేవనగర్ బాషా, దండె సుధాకర్, జాకీర్‌హుసేన్ గన్నీకరీమ్, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా తనయుడు ఫిరోజ్‌లు పాల్గొన్నారు.

చైన్‌స్నాచర్ అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసు అధికారులు

బొమ్మలసత్రం: పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో ఈనెల 22 వ తేది చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన దొంగను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ మందా జావళి ఆల్ఫోన్స్ వివరాలు వెల్లడించారు. ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన లక్ష్మీరాజ్యం కూరగాయాలు కొనుగోలు చేసి చామకాలువ కట్టపై ఇంటికి వెళ్తుండగా సాయిబాబానగర్‌కు చెందిన పెద్ద హుస్సేని గ్లామర్ బైక్‌పై వచ్చి పిడిబాకు చూపించి ఆమె మెడలోని చైన్‌లాక్కుని పరారయ్యాడు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకొని సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించారు. అరెస్టు చేసి విచారించగా చోరీ చేసిన బంగారాన్ని నిందితుడు ముత్తూట్‌ఫిన్‌కార్ప్‌లో కుదువ ఉంచి నగదుతో జల్సాచేసినట్లు చెప్పారన్నారు. నిందితుని వద్ద నుంచి రెండు తులాల బంగారు చైన్, బైక్, పిడిబాకు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐలు ఇస్మాయిల్, సురేష్ కుమార్, ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలి



దీబగుంట్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమం దృశ్యం

గోస్పాడు: రసాయన ఎరువుల, మందుల వాడకాన్ని తగ్గించి రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని వ్యవసాయ అధికారి స్వప్నికా రెడ్డి సూచించారు. మండలంలోని దీబగుంట్ల గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వినియోగం రోజురోజుకు అధికమవుతుందన్నారు. దీని వల్ల పంట పెట్టుబడి పెరగడంతో పాటు పంట ఉత్పత్తులు కలుషితమవుతున్నాయని చెప్పారు. అదే సేంద్రియ ఎరువుల ద్వారా పంటలు పండిస్తే ఖర్చు తగ్గడంతో పాటు పంట ఉత్పత్తులు నాణ్యంగా ఉంటాయన్నారు. నేల ఆరోగ్యం, ప్రజారోగ్యం కాపాడుకునేందుకు ప్రకృతి వ్యవసాయం దోహదపడుతుందన్నారు. సొంత భూమి కలిగిన ప్రతి రైతు విశిష్ట గుర్తింపు నంబర్ కొరకు రైతు సేవ కేంద్రాలకు వెళ్లి నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతు విశిష్ట గుర్తింపు కార్డు ద్వారానే ప్రభుత్వ పథకాలు

నంద్యాల(అర్బన్): రైతులు ప్రత్యేక విశిష్ట గుర్తింపు కార్డు పొందడం ద్వారానే ప్రభుత్వ పథకాలు పొందవచ్చని ఏడీఏ రాజశేఖర్ తెలిపారు. నంద్యాల మండలంలో 43 శాతం మంది రైతులు గుర్తింపు కార్డు పొందారని, మిగిలిన రైతులు సకాలంలో వాటిని ప్రభుత్వ పథకాలు పొందాలని సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని అయ్యలూరు, పెద్దకొట్టాల గ్రామాల రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ నీటి వసతి ఉన్న రైతులు వేసవిలో పెసర, మినుము, కొర్రపంటలు సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ ప్రసాదరావు, జిల్లా వనరుల కేంద్రం బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ ఉమామహేశ్వరమ్మ, ఏఈఓ ముక్తార్‌బాషా, రైతు సేవా కేంద్రం సిబ్బంది అనిల్‌కుమార్‌రెడ్డి, షర్మిల, మాధురి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ

నంద్యాల(అర్బన్): స్థానిక నూనెపల్లె మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం నంద్యాల అర్బన్ ప్రాజెక్టు అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్‌బీ, పడాయ్‌బీ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. నంద్యాల అర్బన్ ప్రాజెక్టు ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నవచేతన 0 నుంచి 3 సంవత్సరాల చిన్నారుల్లో ఎదుగుదల, అభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ 3 నుంచి 5 ఏళ్లలోపు పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయాలన్నారు.